సాక్షి నంద్యాల

శుక్రవారం । 28 । మార్చి । 2025

I




అన్న చెప్పినాడు..

'మట్టిని తరలించి సొమ్ము చేసుకుందాం.. అందరూ తలా ఇంతా సంపాదించుకుందాం..' అని ఇద్దరు టీడీపీ నేతలు ఫోన్‌లో మాట్లాడిన మాటలు చక్కర్లు కొడుతున్నాయి. IIలో▸



మెరవని పచ్చ బంగారం

పసుపు ధర పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాకు రూ.10 వేలు లభించాల్సి ఉండగా మార్కెట్‌లో రూ. 8 వేలు దక్కుతోంది. IIలో▸



.. రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు


వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లాకు చెందిన 16 మందికి పదవులు దక్కాయి. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:54
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 4:51
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:54
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:52

న్యూస్‌రీల్

'అవుకు'లో తగ్గిన నీటిమట్టం



రిజర్వాయర్‌లో తక్కువగా ఉన్న నీరు

అవుకు: రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. సామర్థ్యం 4.168 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.67 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎస్సార్బీసీ నుంచి అవుకు రిజార్వయర్‌కు 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. సాగునీటి కోసం ఎస్సార్బీసీ 13వ బ్లాక్ కాలువకు 380 క్యూసెక్కుల వదులుతున్నారు. పాలేరు, తిమ్మరాజు చెరువుల నుంచి 60 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉంది. పంటల సాగుకు సరిపడా నీరు అందుతోందని ఎస్ఆర్‌బీసీ ఈఈ సురేష్ బాబు తెలిపారు.

హుండీ ఆదాయం రూ. 39.23 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: హుండీల్లో కానుకలు లెక్కించగా మహానందీశ్వరస్వామికి రూ. 39.23లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో గురువారం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు అన్నప్రసాదం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవిక, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు రెండో జాబితా

నంద్యాల(అర్బన్): మెగా డీఎస్సీ ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సంబంధించి రెండో జాబితా విడుదలైందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారిణి చింతామణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వివరాలు వెబ్ పోర్టల్ https:// mdfc. apcfss. in లోతెలుసుకోవచ్చన్నారు. ఉచిత డీఎస్సీ కోసం శిక్షణ సంస్థలను అభ్యర్థులు తమ లాగిన్‌లో ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. మొదటి జాబితాలో ఎంపికైన అభ్యర్థుల శిక్షణ సంస్థలను మార్పు చేసుకునేందుకు అనుమతి లేదని తెలిపారు.

'ప్రభుత్వ ఇఫ్తార్ విందును బహిష్కరిద్దాం'



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకుడు

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందును ముస్లింలు బహిష్కరించాలని నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు కన్వీనర్ అబ్దుల్లా మౌలానా, అబ్దుల్ సమాద్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లుపై టీడీపీ ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదని, నిరసనగా ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అబులైజ్, బాబాఫక్రుద్దీన్, ఇజస్ హుస్సేన్, మస్తానుఖాన్‌బాషా, మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

29న ఇఫ్తార్ విందు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నంద్యాల టౌన్‌హాల్‌లో ఈనెల 29న సాయంత్రం 6గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహాపర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



● ఎదురులేని ఫ్యాన్

తుగ్గలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నూతన ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

'స్థానికం' ఏకమై.. విజయ బావుటాలై!

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. జెడ్పీ, కృష్ణగిరి కోఆప్షన్ సభ్యులుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. నిత్యం ప్రజల కోసం నిలబడే పార్టీ తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ స్థానాల్లో విజయం సాధించింది. 'స్థానిక' ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఎదురులేదని మరోసారి తేలింది.

- నాలుగు స్థానాల్లోను వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం
- జెడ్పీ కోఆప్షన్ సభ్యునిగా ఎం. ఇలియాజ్‌ఖాన్
- జెడ్పీ చైర్మన్‌తో పాటు 37 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరు
- వెల్దుర్తి, తుగ్గలి ఎంపీపీలుగా దేశాయి లక్ష్మీదేవమ్మ, రాచపాటి రామాంజినమ్మ
- కృష్ణగిరి కోఆప్షన్ సభ్యునిగా షేక్ చిన్న షాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని స్థానిక సంస్థల్లో ఏర్పడిన నాలుగు ఖాళీలకు గురువారం నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. జిల్లా పరిషత్, కృష్ణగిరి కోఆప్షన్ సభ్యులతో పాటు తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ స్థానాలకు, జిల్లాలోని ఐదు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలను నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా, ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. జెడ్పీ, కృష్ణగిరి కోఆప్షన్ సభ్యులతో పాటు తుగ్గలి, వెల్దుర్తి మండల పరిషత్తుల్లో వైఎస్సార్‌సీపీకి విశేషమైన బలం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు సునాయాసంగా విజయం సాధించారు.

జెడ్పీ కోఆప్షన్ సభ్యునిగా మదర్షాన్ ఇలియాజ్ ఖాన్

జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యునిగా శ్రీశైలం నియోజకవర్గం వెలుగోడుకు చెందిన మదర్షాన్ ఇలియాజ్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన అభ్యర్థిత్వాన్ని వెలుగోడు జెడ్పీటీసీ అమీరున్‌బీ ప్రతిపాదించగా, మహానంది జెడ్పీటీసీ కేవీఆఆర్ మహేశ్వర రెడ్డి బలపరిచారు. ఈ నేపథ్యంలోనే ఉదయం 10 గంటల్లోపు నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యింది. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డితో కలిపి 37 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరై ఇలాయాజ్‌ఖాన్‌కు మద్దతు ప్రకటించారు. ఇలియాజ్‌ఖాన్ నామినేషన్‌ను స్క్రూటినీ చేసిన అనంతరం వాలీడ్ నామినేషన్‌గా డిక్లేర్ చేసి జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యునిగా ఇలాయాజ్‌ఖాన్‌ను ప్రకటించి డిక్లరేషన్ ఫారం అందించి ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



తరలివస్తున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు



వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని కలసిన జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు

ఏకగ్రీవంగా తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీలు

తుగ్గలి మండల పరిషత్ అధ్యక్షురాలిగా మండలంలోని శభాష్‌పురం ఎంపీటీసీ సభ్యురాలుగా రాచపాటి రామాంజినమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఒకరు గైర్హాజరు కాగా మిగిలిన వారంతా రామాంజనమ్మ అభ్యర్థిత్వానికి మద్దతుగా చేతులెత్తి తమ అంగీకారాన్ని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, హెచ్ఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ ఆమెను ఎంపీపీగా డిక్లేర్ చేసి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. అలాగే వెల్దుర్తి మండలంలో మొత్తం 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, టీడీపీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికకు గైర్హాజరయ్యారు. మిగిలిన 14 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎల్ నగరం ఎంపీటీసీ దేశాయి లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల అధికారి, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ కే తులసీదేవి ఎంపీపీగా ఎన్నికైన లక్ష్మీదేవమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కృష్ణగిరి కోఆప్షన్ సభ్యునిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు చిన్నషాలును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, సెట్కూరు సీఈఓ డా.కే వేణుగోపాల్ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

చెక్కుచెదరని ప్రజాభిమానం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ఎన్ని కుయుక్తులకు పాల్పడినా వైఎస్సార్‌సీపీపై ప్రజాభిమానం చెక్కుచెదరలేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నా రు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా ఏక గ్రీవంగా ఎన్నికైన మదర్షాన్ ఇలియాస్ ఖాన్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి కలిసి గురువారం సాయంత్రం కర్నూలు గిప్సన్ కాలనీలో ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. గెలుపొందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యున్ని ఎస్వీ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. 'కూటమి' నేతలు ఎన్ని కు ట్రలు చేయాలని చూసినా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారన్నారు. విజయంలో కీలకంగా వ్యవహరించిన పత్తికొండ మాజీ ఎ మ్మెల్యే కంగాటి శ్రీదేవి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

విజేతలు..



జెడ్పీటీసీ కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన ఇలియాజ్ ఖాన్‌కు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



రాచపాటి రామాంజనమ్మకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి అజయ్‌కుమార్



వెల్దుర్తి ఎంపీపీగా ఎన్నికైన లక్ష్మీదేవమ్మకు డిక్లరేషన్ ఫాం అందిస్తున్న ప్రిసైడింగ్ అధికారి తులసీదేవి



ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ చిన్నషాలుకు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి డాక్టర్ వేణుగోపాల్

ఐదు పంచాయతీల్లో ఉప సర్పంచుల ఎన్నిక...

జిల్లాలోని ఐదు గ్రామ పంచాయతీల్లో జరిగిన ఎన్నికల్లో సభ్యులు.. ఉప సర్పంచులను ఎన్నుకున్నారు. ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా లక్ష్మమ్మ, ఆలూరు మండలం మొలగవెల్లి ఉప సర్పంచ్‌గా గరక షాకీరా, కర్నూలు మండలం సుంకేసుల ఉప సర్పంచ్‌గా వడ్డే నీలమ్మ, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి ఉప సర్పంచ్‌గా ఎం రామాంజనేయులు, దేవనకొండ మండలం వెలమకూరు ఉప సర్పంచ్‌గా ఉప్పర సరస్వతిని ఎన్నుకున్నారు.

భృంగివాహనంపై మల్లన్న

శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు

- ఐదు రోజుల పాటు నిర్వహణ
- మహాలక్ష్మీ అలంకారంలో శ్రీశైల భ్రామరి
- శ్రీగిరి క్షేత్రానికి పోటెత్తిన కన్నడ భక్తులు



శ్రీశైల పురవీధిలో భక్తజనం మధ్య ఆదిదంపతుల గ్రామోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం ఉగాది మహోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ నెల 31 వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని కన్నడ భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. శ్రీశైల భ్రామరి మహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి భృంగివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ నిర్వహణలో భాగంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయప్రాంగాణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. ఈ సందర్భంగా చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు నిర్వహించారు, అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అధికారులు, అర్చకస్వాములు ధరించారు. రుత్వికులకు దీక్షావస్త్రాలను అందజేశారు. అమ్మవారి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చన పూజలను జరిపించారు. అనంతరం ఉగాది మహోత్సవాలకు అంకురార్పణ చేశారు.

మహాలక్ష్మీ అలంకారంలో భ్రామరి

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీశైల భ్రమరాంబాదేవి మహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలు కలిగిన దేవి పై రెండు చేతులలో పద్మాలను, కింది చేతులలో కుడివైపున అభయహస్తం, ఎడమవైపున వరముద్రతో దర్శనం ఇచ్చారు. మహాలక్ష్మీ స్వరూపాన్ని దర్శించడం వల్ల శత్రుబాధలు నివారించబడి, సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.



చండీశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కనుల పండువగా భృంగివాహన సేవ

ఉగాది మహోత్సవాల్లో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామికి భృంగివాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై ఆశీనులను చేసి అలంకార మండపంలో పూజాదికాలు నిర్వహించారు. భృంగీవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను దర్శిస్తే పాపాలు హరించబడుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం ప్రత్యేక అలంకీకృతులైన అమ్మవారికి, వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీశైలంలో నేడు

ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవికి మహాదుర్గ అలంకారం, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు కైలాసవాహనసేవ, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు.



భృంగివాహనాధీశులైన ఉత్సవమూర్తులు



మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



శంఖం పూరిస్తున్న సాధువు

నేటి నుంచి వడగాల్పులు మరింత తీవ్రం

- కర్నూలులో 41.7, రుద్రవరంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో ఎండల తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది. ఇటీవల అక్కడక్కడ వర్షాలు పడటం, ఆకాశం మేఘావృతం కావడంతో ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. తాజాగా మళ్లీ ఆందోళన కలిగించే రీతిలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. కర్నూలు అర్బన్‌లో ఏకంగా 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లా రుద్రవరంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. కోడుమూరు, కోసిగి, కౌతాలం, మంత్రాలయం, ఓర్వకల్, పాణ్యం, శ్రీశైలం. మహనంది, చాగలమర్రి, బనగానపల్లి, బండిఆత్మకూరు మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆర్‌డీఓ కార్యాలయ ఫర్నిచర్ వేలానికి కోర్టు ఆదేశం

కర్నూలు(సెంట్రల్): రైల్వే కోచ్ వ్యాగన్ ఫ్యాక్టరీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఆర్‌డీఓ కార్యాలయ ఫర్నిచర్‌ను వేలం వేసి పరిహారం చెల్లించాలని జిల్లా ఆరో అదనపు కోర్టు తీర్పు ఇచ్చింది. ఏప్రిల్ 18వ తేదీన వేలం వేయాలని ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు సమీపంలో రైల్వేకోచ్ వ్యాగన్ ఫ్యాక్టరీ కోసం కర్నూలు మండలం పంచలింగాల, ఈ.తాండ్రపాడులకు చెందిన 46 మంది రైతుల నుంచి 119 ఎకరాల భూమిని సేకరించింది. అయితే ఎకరాకు పరిహారంగా రూ.6,17,326 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పరిహారం తమకు మార్కెట్ విలువకు తగ్గట్టుగా సరిపోదని రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఎకరాకు రూ.32,72,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చింది. అయితే నిర్దేశించిన ధరలో సగాన్ని కోర్టులో 8 వారాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలను ప్రభుత్వం పాటించకపోవడంతో మరోసారి రైతులు కోర్టును ఆశ్రయించారు. ఆర్‌డీఓ కార్యాలయ ఫర్నిచర్‌ను జప్తు చేయాలని విజ్ఞప్తి చేయడంతో రైతుల అభిప్రాయంతో కోర్టు ఏకీభవించింది. ఏప్రిల్ 28న ఆర్‌డీఓ కార్యాలయ ఫర్నిచర్‌ను వేలం వేయాలని ఆదేశాలు జారీ చేసింది.

కోర్టును తనిఖీ చేసిన జిల్లా జడ్జి

పత్తికొండ రూరల్: పత్తికొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం జిల్లా జడ్జి కబర్ది తనిఖీ చేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు ప్రతిపాదనల నేపథ్యంలో భవనం, స్థలం తదితర వివరాలను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సబ్‌జైలుకు వెళ్లి అక్కడ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను సూపరింటెండెంట్‌తో అడిగి తెలుసుకున్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా హరినాథ్, వెంకటేశ్వర్లు



నూతనంగా ఎన్నికైన బార్ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం(బార్ అసోసియేషన్) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.హరినాథ్‌చౌదరి, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 856 మంది ఓటర్లు ఉండగా 767 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష స్థానం కోసం పోటీ పడిన పి.హరినాథ్‌చౌదరి తన సమీప ప్రత్యర్థి బి.మురళీమోహన్‌పై 92 ఓట్లతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి జరిగిన పోటీలోఎం. వెంకటేశ్వర్లు తన ప్రత్యర్థి ఎం.ఆంజనేయులుపై 76 ఓట్లతో విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీ స్థానానికి పోటీ చేసిన ఎం. బాలసుబ్రమణ్యం తన ప్రత్యర్థి బీకే నాగారుజుపై 411 ఓట్లతో గెలిచారు. లైబ్రరీ సెక్రటరీ స్థానానికి పోటీలో ఉన్న పి.చంద్రశేఖర్ తన ప్రత్యర్థి సంపత్‌పై భారీ ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష, కోశాధికారి, క్రీడా కార్యదర్శి మహిళాప్రతినిధి స్థానాలకు త్రివిక్రమ్, గౌతంమానె, బెస్త సుధాకర్, కె. అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి ఎన్నికల అధికారులు జి.విజయకుమార్, కె.రంగనాథ్,సి. ప్రభాకరరెడ్డి డిక్లరేషన్ పత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

బహిష్కరణ ఉత్తర్వులు నిలుపుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నుంచి నలుగురు కార్యవర్గసభ్యులను బహిష్కరిస్తూ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర నాయకత్వం నిలుపుదల చేసింది. సంఘం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే కారణంతో ఇటీవల జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రమణ, కోశాధికారి బాస్కరనాయుడులను ముందుగా సస్పెండ్ చేశారు. ఆ తర్వాత సంఘం నుంచి బహిష్కరించారు. దీనిపై నలుగురు నేతలు రాష్ట్ర నాయకత్వాన్ని ఆశ్రయించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్‌లను తాము ఆదేశాలు ఇచ్చేంత వరకు తాలూకా ఎన్నికలు నిర్వహించవద్దని జిల్లా నాయకత్వాన్ని ఆదేశించారు. దీంతో మొదటిసారిగా జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డికి ఎదురు దెబ్బతగిలినట్లు అయింది. తాజా నలుగురిపై సస్పెన్షన్, బహిష్కరణ ఉత్తర్వులను కూడా నిలుపుదల చేయడం గమనార్హం.

- జిల్లా అధ్యక్షునిగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వెంగళ్‌రెడ్డి త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. తన వారసుడిని కూడా ఏకపక్షంగా సిద్ధం చేశారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై అసోసియేషన్‌లో విభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది.

బైక్ దగ్ధం



కాలి బూడిదైన బైక్‌ను పరిశీలిస్తున్న స్థానికులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ శివారులో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో ఓ బైక్ దగ్ధమైంది. ఇనగండ్ల గ్రామానికి చెందిన మద్దిలేటి తన హోండా షైన్ బైక్‌పై సి.బెళగల్‌కు వస్తుండగా మార్గమధ్యలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో సాంకేతిక సమస్యతో నిలిచి పోయింది. పరిశీలిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోవడంతో బైక్ పూర్తిగా కాలి పోయింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని తెలుస్తోంది.

హిజ్రాల రాళ్ల దాడి



రాళ్లతో దాడి చేసుకుంటున్న హిజ్రాలు

బొమ్మలసత్రం: పట్టణంలోని టూటౌన్, తాలుకా పోలీస్‌స్టేషన్ల మధ్య రెండు వర్గాలకు చెందిన హిజ్రాలు రాళ్లు, కారం పొడితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. రానున్న పండుగల నేపథ్యంలో పట్టణానికి చెందిన హిజ్రాలు దుకాణాల యజమానుల వద్ద పండుగ మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఈక్రమంలో మరో వర్గం ఎదురు కావడంతో ఒకరికొకరు దాడులు చేసుకుని ఒక గుంపు తాలుకా స్టేషన్ వద్దకు.. మరో గుంపు టూటౌన్ వద్దకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. రెండు పోలీస్‌స్టేషన్లు పక్కపక్కనే ఉండడంతో రెండు వర్గాలు మరోసారి దాడి చేసుకున్నాయి. రాళ్లు, కారంపొడి పొట్లాలు ఒకరిపై మరొకరు విసిరి దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. పోలీసులను సైతం లెక్క చేయకుండా జనావాసాల మధ్య రాళ్లు విసురుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిజ్రాలను పోలీసులు క్రమశిక్షణలో ఉంచకపోతే సామాన్యులను రోడ్లపైకి రానివ్వరేమోనని ఆందోళన చెందుతున్నారు.

5+3=8



పాలు తాగుతున్న పసి కూనలు

కోవెలకుంట్లలో నివాసం ఉంటున్న అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన మారం భాస్కర్‌రెడ్డి పెంపుడు కుక్క గురువారం ఎనిమిది కూనలకు జన్మనిచ్చింది. నాలుగు సంవత్సరాల క్రితం బనగానపల్లెలో ఉన్న తమ బంధువుల ఇంటి వద్ద నుంచి పామేరియన్ జాతి శునకాన్ని తెచ్చుకుని పెంచుకుంటున్నాడు. అరవై రోజుల క్రితం గర్భందాల్చిన కుక్క 5 మగ కూనలు, 3 ఆడ కూనలకు జన్మచ్చింది. కూనలన్నీ ఆరోగ్యంగా ఉన్నాయి. పామేరియన్ జాతి శునకాలకు సరైన ఆహార పదార్థాలతో పోషణ కల్పిస్తే ఆరు నుంచి ఎనిమిది పిల్లలకు జన్మనిచ్చే ఆస్కారం ఉందని పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. – కోవెలకుంట్ల

వద్దురా.. సోదరా!



బైక్‌పై నలుగురు ప్రయాణిస్తున్న మైనర్లు

ప్రమాదాల నివారణకు చట్టాలను కఠినతరం చేస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. పిల్లల చేతికి వాహనాలు ఇవ్వకూడదని పోలీసులు, అధికారులు అవగాహన కల్పిస్తున్నా పెద్దలు పెడచెవిన పెడుతున్నారు. మైనర్లు బైక్‌లు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామంటున్నా బేఖాతరు చేస్తున్నారు. గురువారం కొలిమిగుండ్ల ప్రధాన రహదారిలో నలుగురు మైనర్లు ఒకే బైక్‌పై రయ్‌మంటూ వెళ్తుండటం చూసిన స్థానికులు నివ్వెరపోయారు. వీరికి చెప్పేదెవరంటూ చర్చించుకున్నారు. – కొలిమిగుండ్ల

దాహం తెచ్చిన తిప్పలు



ఎరక్కపోయి వచ్చి ఓ శునకం ఇరుక్కుపోయింది. మండు వేసవిలో మూగ జీవాల నీటి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇందుకు నిదర్శనం ఈ కుక్క కష్టమే. నంచర్ల సమీప పొలంలో గురువారం గొర్రెల కాపరులు బిందెలో నీటిని తెచ్చుకుని తాగారు. కొంచెం నీరు మిగలడంతో ఒక చోట ఉంచారు. అటుగా వచ్చిన ఒక కుక్క దాహం తీర్చుకోవడానికి బిందెలో తల దూర్చడంతో ఇరుక్కుపోయి విలవిలాడింది. భయంతో బిందెతోనే పరుగులు తీసి రహదారిపైకి చేరుకుంది. కొందరు వాహనదారులు గమనించి చాలా కష్ట పడి చివరకు బిందెను తొలగించడంతో ఊపిరిపీల్చుకుంది. – చిప్పగిరి

అన్న చెప్పాడు.. తవ్వేద్దాం

- అందరం తలా ఇంత పంచుకుందాం
- టైం ఉన్నప్పుడే నాలుగు డబ్బులు సంపాదించుకుందాం
- పది బండ్లు పెట్టుకుని కూర్చుందాం
- ఎవరైనా ఆపితే టిప్పర్‌తోనే కొడతా!
- మట్టి తవ్వకాలపై టీడీపీ నేతల ఫోన్ సంభాషణ వైరల్



బైరవాణి చెరువులో మట్టి తవ్వకాలు (ఫైల్)

మహానంది: 'మట్టిని తరలించి సొమ్ము చేసుకుందాం, ఇప్పుడే నాలుగు డబ్బులు సంపాదించుకోకపోతే మళ్లీ ఎప్పుడు చెప్పు.. కాదు, కూడదని ఎవడైనా అడ్డొస్తే బండి (టిప్పర్)తో తొక్కిస్తా. అందరూ తలా ఇంతా సంపాదించుకుందాం.. నీకు అర్ధ రూపాయా, నాకు అర్ధ రూపాయి, పై వాళ్లకు ఇంత ఇద్దాం' మట్టి తవ్వకాలపై ఇద్దరు టీడీపీ నేతలు ఫోన్‌లో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయం చివరకు టీడీపీ అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. 'తలా ఓ రూపాయి తీసుకుందాం' అంటూ ఫోన్‌లో ఏకంగా నియోజకవర్గ నేతల పేర్లతో సహా చర్చించుకోవడం విశేషం. మహానంది మండలం గోపవరం గ్రామంలో బైరవాణి చెరువు ఉంది. ఇటీవల ఈ చెరువు నుంచి పొలాలు, ప్లాట్లకు తరలించే మట్టితో పాటు ఇటుకలకు వినియోగించే ఎర్రమట్టి ఎక్కువగా ఉంది. అధికారంలో ఉన్నాం.. మనల్ని అడిగేదెవరూ అనుకుని ఇటీవల కొద్దిరోజుల క్రితం మట్టి తరలింపుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకోవడంతో మట్టి తరలింపు ఆగిపోయింది. అయితే ఇదే చెరువులోని మట్టి తరలింపుపై గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండటంతో ఒకరిపై ఒకరు వాదోపవాదాలు చేసుకున్నారు. పార్టీలోని రెండు వర్గాలకు చెందిన ఇద్దరు నాయకులు క్రాంతికుమార్ యాదవ్, శ్రీనివాసులు ఫోన్‌లో మాట్లాడుకున్న సంభాషణ బయటికి రావడంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. వారి మాటల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, నియోజకవర్గ నేత బన్నూరు రామలింగారెడ్డిల పేర్లు సైతం రావడంతో ఆ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

టీడీపీ నేతల మధ్య సంభాషణలో కొత్త భాగం..

కాంత్రి కుమార్.. గ్రామంలోని చెరువులో మట్టి విషయం నాకు తెలియపరిచావా, బండ్లు పెడుతున్నాం.. నువ్వురా.. అని నాకు చెప్పావా..

శ్రీనివాసులు.. రామలింగారెడ్డితో మాట్లాడుకున్నాం. అంతా సెట్ చేసుకున్నాం కదా.. ఓ సారి ఎస్‌ఐని కలిసి రండని రామలింగారెడ్డి చెప్పాడు కదా.. మట్టి శ్యాంపిల్ కూడా పంపించాను. 50 ట్రిప్పులైనా తోలుతా.. మనమే ఒకటిగా లేకుంటే ఈ రెండేళ్లలో ఎలా మట్టి తోలుకుంటాం.

కాంత్రి.. టిప్పర్ పెట్టే ముందు నాకు చెప్పింటే.. నేను వచ్చేవాడిని కదా

శ్రీను.. రామలింగారెడ్డిది రామలింగారెడ్డికి పోతాది.. మనది మనకు వస్తాది.. బండ్లు పెట్టుకోమన్నాడు.

కాంత్రి.. నాకు చెప్పొచ్చు కదా.. బండ్లు మనవే ఉన్నాయి.

శ్రీను... 50 ట్రిప్పులు ఆర్డర్ ఉంది. మట్టి తోలేందుకు ఒకాయన రూ. మూడు వేలకు ఒప్పుకున్నాడు. అయ్యలూరుకు తోలాలి. ఆ రోజు బండ్లు ఆపకుంటే ఇప్పటికే 50 ట్రిప్పులు తోలేవాని. లెక్క వచ్చేది. ఎవరిది వాళ్లకు పంపిద్దును. కష్టపడి పది రూపాయలు ఇవ్వాలనుకున్నాను. మనిషికి అర్ధ రూపాయ, పదిపైసలు చొప్పున ఇద్దామనుకున్నా.

కాంత్రి.. బండి పెట్టేటప్పుడు చెప్పాలని తెలియదా

శ్రీను.. రెండు టిప్పులు తోలేలోపు వైసీపీ వాళ్లు వచ్చి ఆపారు.

కాంత్రి.. నేను పెడతా ఆపమను.

శ్రీను.. ఆపోజిట్ వాళ్లు ఎవడైనా ఆపితే టిప్పర్‌తోనే కొడతా.

కాంత్రి.. తహసీల్దార్‌తో మాట్లాడి అనుమతి తీసుకుందాం. ఆల్‌రెడీ ఎమ్మెల్యే అన్న తహసీల్దార్‌కు చెప్పాడు. వరి కోతలు అయిపోయిన తర్వాత తహసీల్దార్‌తో మాట్లాడుదాం.

ఇరిగేషన్, విజిలెన్స్ అధికారులపై తేనెటీగల దాడి

- చెక్‌డ్యామ్‌లు తనిఖీ చేస్తుండగా ఘటన
- ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ జేఈ పరిస్థితి విషమం
- మరో నలుగురికి స్వల్ప గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇరిగేషన్ జేఈ కృష్ణప్రియ



గాయపడిన ఇరిగేషన్ జేఈ మనోజ్

వెల్దుర్తి: విధి నిర్వహణలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న మైనర్ ఇరిగేషన్, విజిలెన్స్ అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎల్ తండా గ్రామ పరిధిలో అదే గ్రామానికి చెందిన రాజు చెక్‌డ్యామ్‌లు నిర్మించాడు. మూడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నాణ్యతలో తేడాలున్నాయని, నిధులు కాజేశారని అందిన ఫిర్యాదుల మేరకు గురువారం విజిలెన్స్ జేఈలు ఆనంద్‌బాబు, శ్రీనివాసరావు ఇరిగేషన్ జేఈ రవినాయక్, క్వాలిటీ కంట్రోల్ జేఈలు కృష్ణప్రియ, మనోజ్, నారాయణ కలిసి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. రెండు చెక్‌డ్యామ్‌ల పరిశీలన అనంతరం మూడవ చెక్‌డ్యామ్ పరిశీలన సందర్భంగా వీరందరిపై చెట్లపొదల్లోని పెద్ద తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. కృష్ణప్రియ ముఖంపై తేనెటీగలు తీవ్రంగా దాడి చేయగా, మనోజ్, ఆనంద్‌బాబును ఓ మోస్తారుగా, రవినాయక్, నారాయణ, శ్రీనివాసరావును స్వల్పంగా గాయపరిచాయి. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈలు రియాజ్, నాగరాజు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని వారిని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్సానంతరం అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిని విజిలెన్స్ జిల్లా ఎస్పీ చౌడేశ్వర రావు, ఇరిగేషన్ ఎస్ఈ ద్వారాకానథ్ రెడ్డిలు పరామర్శించారు. కృష్ణప్రియను వైద్యులు 24 గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి మిగితా వారిని చికిత్సానంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

'బెల్టు' బట్టబయలు



మద్యం విక్రేతలను అరెస్ట్ చేసిన దృశ్యం

మహానంది: కూటమి నేతలు కాసుల కోసం బరితెగించారు. ఏ అవకాశం వచ్చినా వదలకుండా అందినకాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. తాజాగా మహానంది మండలం గోపవరం గ్రామంలో అధికార పార్టీకి చెందిన నేతలు వెంకటేశ్వర్లు, తదితరులు గోపవరం మెట్ట వద్ద బెల్టుషాపులు నిర్వహించడం వివాదాస్పదమైంది. గ్రామంలోని ప్రధాన రహదారి(మెట్ట)పైన బెల్టుషాపులు నిర్వహించొద్దని చెప్పిన యువకులపై 'నువ్వెవర్రా చెప్పేదంటూ' అధికారపార్టీ నేతలు ఎదురు తిరుగుతూ దాడికి పాల్పడ్డారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారపార్టీకి చెందిన నేతలు, ప్రశ్నించిన యువకుల మధ్య జరిగిన ఘటన వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మేము ఇక్కడే మద్యం అమ్మి తీరుతాం.. మీ చేతనైన పని చేసుకోండి.. అయినా నువ్వెవర్రా చెప్పడానికి' అంటూ వాల్మీకి సంఘం యువకులను టీడీపీ నేతలు బెదిరించారు.

ఇద్దరిపై కేసు నమోదు..

టీడీపీ నేతలు బెల్టుషాపు నిర్వాకం వీడియో రూపంలో బయటికి రావడంతో ఎక్సైజ్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్ఐ బ్రహ్మయ్య, సిబ్బంది గోపవరంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో వెంకటేశ్వర్లు, బాష వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

ఈ–శ్రమ్‌తో సామాజిక భద్రత

- నమోదుకు ఈ నెలాఖరు వరకు అవకాశం



వెంకటేశ్వర్లు, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్



కర్నూలు(అర్బన్): అసంఘటిత రంగాల్లోని, వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో ఈ–శ్రమ్ నమోదు లక్ష్యం 14,07,281 కాగా, ఈ నెల 25వ తేది వరకు 6,39,247 మంది నమోదు చేసుకున్నారు. నమోదుకు ఈ నెలాఖరు వరకు సమయం ఉన్నట్లు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ –శ్రమ్ నమోదుతో కార్మికులు దురదృష్టవశాత్తూ మృతి చెందినా, అంగవైకల్యం ఏర్పడినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందన్నారు.

ఎవరు అర్హులంటే ...

- 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి.
- అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయ పన్ను పరిధిలోకి రాని వారు.
- ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర చేతివృత్తుల వారు, వాహన చోదకులు, వీధి వ్యాపారులు, సేవా రంగంలో ఉన్న వారు.

ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయంటే..

- ప్రమాదవశాత్తూ మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షికంగా గాయపడితే రూ.లక్ష ఆర్థిక సహాయం అందుతుంది.
- వలస కార్మికులకు రాష్ట్రంలో లేదా వారి సొంత ప్రాంతంలో ఎక్కడా రేషన్‌కార్డు లేకుంటే పౌర సరఫరాల శాఖ ద్వారా మంజూరు చేసే నిత్యావసర సరుకులు అందజేస్తారు.
- ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

ఇలా నమోదు చేసుకోవాలి ...

ఈ–శ్రమ్ నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లు లేదా కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేస్తారు. నామినీ ఆధార్ వివరాలను అందజేయాల్సి ఉంటుంది. నమోదు పూర్తయిన అనంతరం యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేద్దామని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఫ్యాప్టో నంద్యాల జిల్లా నూతన కార్యవర్గం చైర్మన్ మాధవ స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హృదయరాజు మాట్లాడుతూ ప్రైమరీ, ఆదర్శ పాఠశాల పేరుతో సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలను విలీనం చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం ఫ్యాప్టో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా కేవీ శివయ్య (ఏపీటీఎఫ్ 257), సెక్రటరీగా అబ్దుల్‌కలాం (రూటా), కో చైర్మన్లుగా కిశోర్(డీటీఎఫ్), లక్ష్మణ్‌నాయక్ (ఎస్‌టీయూఎస్), డిప్యూటీ సెక్రటరీగా ప్రసాద్ (యూటీఎఫ్), మౌలాలి(ఎస్‌టీయూ), శ్రీనివాసులు (ఏపీటీఎఫ్ 1938), ట్రెజరర్‌గా అబ్దుల్‌అజీజ్(ఆప్టా)లను ఎన్నుకున్నారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, మాధవ స్వామి, సాంబశివుడు, అరవింద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హృదయరాజు

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన లారీ

- 20 గొర్రెలు మృతి
- నిలిచిన లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు
- బస్సును ఢీకొన్న మరో లారీ



మృతి చెందిన గొర్రెలు

పాణ్యం: బపలనూరు మెట్ట వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 గొర్రెలు మృతి చెందగా, మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. పిన్నాపురం గ్రామానికి చెందిన గని వెంకట సుబ్బయ్య, ఓరుగంటి సుధాకర్, ఒరుగంటి వెంకటకృష్ణ, మిద్దె రమణయ్య, మూగ ధనికొండకు చెందిన జీవాలను మేత కోసం తీసుకెళ్తూ బపలనూరు మెట్ట గురువారం తెల్లవారుజామున రోడ్డు దాటిస్తున్నారు. వేగంగా వస్తున్న లారీ గమనించి బ్రేకులు వేసేలోపే లారీ కింద పడి అక్కడిక్కడే 20 గొర్రెలు మృతి చెందాయి. కాగా ఈ ప్రమాదంలో రహదారిపై లారీ నిలిచిపోయింది. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి తిరుపతికి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లారీ ఢీకొని నిలిచిపోయింది. వెనుక వస్తున్న మరో లారీ బస్సును ఢీకొంది. కాగా బస్సులో ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు లారీ, బస్సును స్టేషన్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లాకు చెందిన 16 మందికి పదవులు దక్కాయి. గురువారం సాయంత్రం పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియమక ఉత్తర్వులు జారీ చేసింది.

పేరు	హోదా
కె.లక్ష్మీనారాయణ రెడ్డి	రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి
ఎం.శ్రీనివాసరెడ్డి	రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి
పి.శ్రీనివాసరెడ్డి	రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి
కురువ నాగరాజు	రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
ఇ.సత్యనారాయణ గౌడు	రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
గల్లెల ఆనంద్	ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి
గుడిసె మహానంది	ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
నాయకల్లు ప్రసాద్	ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
పి.వెంకటేశ్వర్లు	వాలంటీర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
జి.రాకేష్	వలంటీర్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి
ఎం.దివాకర్ నాయుడు	వలంటీర్స్ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
కె.మధుసూదన్ రెడ్డి	బూత్ కమిటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
జి.శ్రీనివాసులు	బూత్ కమిటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
మాచాని వెంకటేష్	చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
జి.టి.వీర దేవరాజు	చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి
ఎం.సురేష్	చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

రెండో రోజు విచారణ

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో ఇటీవల 7, 8వ తరగతి విద్యార్థులపై పదో తరగతి విద్యార్థి దాడి చేసిన ఘటనపై రెండో రోజు కూడా డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి విచారణ చేపట్టారు. గురువారం హాస్టల్‌కు చేరుకున్న ఆయన అక్కడి విద్యార్థులతో ఘటనపై వివరాలు ఆరా తీసి నమోదు చేశారు. అలాగే దాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన విద్యార్థుల వివరాలు, దాడికి గురైన విద్యార్థులతో మాట్లాడారు.

మెరవని పచ్చ బంగారం

- జిల్లాలో 590 హెక్టార్లలో పసుపు సాగు
- దుంప తెగులుతో తగ్గిన దిగుబడులు
- మార్కెట్‌లో ధర పతనంతో రైతుల ఆందోళన



పసుపును ఉడికిస్తున్న కూలీలు

కొలిమిగుండ్ల: ఆరుగాలం కష్టపడి పసుపు సాగు చేసిన రైతులు ఈ ఏడాది నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఎన్నో ఆశలతో పండించిన పంటకు రోజురోజుకు మార్కెట్‌లో ధర పడిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అన్నదాతకు ఏమాత్రం సహాయ సహకారాలు అందడం లేదు. జిల్లాలో కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయినపేట, ఆళ్లగడ్డ, చాగలమర్రి, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, పాములపాడు తదితర మండలాల్లో 590 హెక్టార్లలో పసుపు సాగు చేశారు. నామమాత్రంగా వర్షాలు కురిసినప్పటికీ బోర్ల కింద రైతులు పంట వేసేందుకు ముందుకొచ్చారు. పంట వేసిన కొద్ది రోజులకే దుంప తెగులు ఆశించి పంట బాగా దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. పసుపు సాగుకు కనీసం తొమ్మిది నెలల సమయం పడుతుంది. పైగా పెట్టుబడి సైతం ఎక్కువగా ఉంటుంది. ఎకరా సాగుకు విత్తనం, కలుపుతీత, కూలీలు, రసాయన ఎరువులు, పసుపు కొమ్ముల తవ్వకానికి, ఉడకబెట్టేందుకు దాదాపు రూ.1.50 లక్షలకు పైగానే ఖర్చు వస్తోంది. సాధారణంగా ఎకరాకు 30 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సి ఉండగా దుంప తెగులు ఆశించడంతో దిగుబడి 25 క్వింటాళ్లలోపే వచ్చింది.

నిరాశపర్చుతున్న ధరలు

ఏడాదిలో తొమ్మిది నెలలు రేయింబవళ్లు కష్టపడి పంట పండించిన పంట దిగుబడి చేతికొచ్చే సరికి ధరలు పూర్తిగా తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పసుసు మార్కెట్‌లో క్వింటా ధర రూ.9 నుంచి 10 వేల మాత్రమే ధర పలుకుతుంది. ఈ పరిస్థితుల్లో కష్టానికి నష్టాలే మిగులుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిష్టంగా 10 వేలు ఉండటంతో మార్కెట్‌లో గ్రేడింగ్ పేరుతో క్వింటాకు రూ. 8 వేలు దక్కడం కష్టమంటున్నారు. ఈపరిస్థితిల్లో పెట్టుబడి అయినా చేతికందుతుందా లేదోనని ఆందోళన చెందుతున్నారు. క్వింటాకు కనీసం రూ.15వేలు ధర ఉంటే కష్టానికి తగ్గఫలితం లభిస్తుందన్నారు.

కష్టానికి ఫలితం రావడం లేదు



తొమ్మిది నెలలు శ్రమటోడ్చినా చివరకు కష్టానికి తగ్గ ఫలితం రావడం లేదు. ఎకరన్నరలో పసుపు సాగు చేశాను. దిగుబడి ఎకరాకు 25 క్వింటాళ్లు మించి వచ్చే అవకాశాలు లేవు. తెగుళ్లతో దిగుబడి తగ్గిపోతుంది. గ్రామంలో వారసత్వంగా పసుపు సాగు చేస్తు వస్తున్నాం. ఈసారి వర్షాలు సరిగా లేక చెరువులో నీళ్లు లేవు. పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకోవాలి. – వర కుమార్, రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే తప్ప రైతులు కోలుకునే పరిస్థితి లేదు. ఇప్పుడున్న ధర ప్రకారం ఏమాత్రం లాభం ఉండదు. ప్రతి ఏటా ఆశతో పంట పండిస్తున్నా దిగుబడి ఉంటే ధర ఉండటం లేదు. పసుపుకు క్వింటాకు రూ.15 వేలు ధర కల్పిస్తేనే రైతు కష్టపడ్డందుకు కొంతన్న లాభం వస్తుంది. ప్రస్తుత ధర చూస్తే పెట్టుబడి వస్తే చాలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. – నారాయణ, రైతు